క్లుప్తంగా

గూడమాలిపుట్టు రోడ్డులో జంగిల్ క్లియరెన్స్



జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న సర్పంచ్ బాబూరావు

ముంచంగిపుట్టు: మండలంలో పెదగూడ పంచాయతీ గూడమాలిపుట్టు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను ఆదివారం సర్పంచ్ మండి బాబూరావు ఆధ్వర్యంలో తొలగించారు. గూడమాలిపుట్టు నుంచి వనుగుపుట్టు వెళ్లే మార్గంలో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో గత కొన్ని నెలలుగా వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించారు. సర్పంచ్ చొరవపై వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అడ్డతీగల: స్థానిక గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు స్టేషనరీ వితరణగా అందజేశారు. 72 మంది విద్యార్థులకు ఆదివారం ఇక్కడ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.అప్పలస్వామి, బి.మధుబాబు, అప్పారావు, ఎ.ప్రసాద్, సిహెచ్.రఘు తదితరులు పెన్నులు, అట్టలు, స్కేల్స్ అందజేశారు. విద్యార్థులంతా బాగా చదువుకుని పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత కావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టల పంపిణీ



విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ పండా సుబ్రహ్మణ్యం

పెదబయలు: పదో తరగతి విద్యార్థులు బాగా పరీక్షలు రాయాలని రూడకోట మాజీ సర్పంచ్ పండా సుబ్రహ్మణ్యం ఆకాంక్షించారు. ఆదివారం రూడకోట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. సోమవారం నుంచి జరిగే పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో కంభం రాధాకృష్ణ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక



ఆలయ ప్రాంగణంలో సమావేశమైన కమిటీ సభ్యులు

హుకుంపేట: ఉక్కుర్బ గ్రామంలో వచ్చే నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించే భీమలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు లకె చిట్టిబాబు పేర్కొన్నారు. ఆదివారం తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ గ్రామంతోపాటు ఇసుకగరువు, రాకసిరాయి, ఒంటిపుట్టు, పోదిలి, పత్రిమెట్ట గ్రామ పెద్దల సమక్షంలో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ చైర్మన్‌గా కంబిడి సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా అడప బంగారు నాయుడు, సభ్యులుగా సిరగం కొండబాబు, పాంగి గణేష్, గెమ్మెలి బుల్లిబాబు, సూకురు సత్యరాజుతోపాటు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మూగజీవాల కోసం ప్రత్యేక చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూర్యనారాయణ

కె.కోటపాడు: పదేళ్లుగా వేసవిలో మూగజీవాలకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న కుభిరెడ్డి రాధాకృష్ణ, వరలక్ష్మి అభినందనీయులని కింతాడకు చెందిన రావాలమ్మ తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు కన్నూరు సూర్యనారాయణ అన్నారు. కూండ్రపువానిపాలెంలో రాధాకృష్ణ ఇంటి పరిసరాల్లో ఏర్పాటు చేసిన మూగజీవాల చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. పక్షులతో పాటు మూగజీవాలకు నీటిని ప్రత్యేక పాత్రలలో అందుబాటులో ఉంచుతూ దాహార్తిని తీర్చుతున్నట్లు తెలిపారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం



ముంచంగిపుట్టు పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

ముంచంగిపుట్టు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవోలు కృష్ణమూర్తి, రత్నకుమార్ తెలిపారు. పరీక్షల ఏర్పాట్లను ఆదివారం వారు దగ్గర నుంచి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ప్రతి పరీక్ష గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మూడు సెంటర్ల నుంచి 490 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, వీరికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మరుగుదొడ్లు, తాగునీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. విద్యార్థులు సాయంత్రం పరీక్ష కేంద్రాల్లో రూమ్ నంబర్లు, హాల్ టికెట్ నంబర్లు చూసుకున్నారు.

హుకుంపేట: మండలంలో పదో తరగతి పరీక్షలకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో సోమెలి చెల్లయ్య తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల–1,2, కేజీబీవీతోపాటు బాకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 546 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. బాకూరు సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదన్నారు. సోమవారం ఉదయం 8 గంటల కల్లా ఏర్పాటు చేస్తారని ఎంఈవో తెలిపారు.

కొయ్యూరు: మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లోను మొత్తం 680 మంది విద్యార్థులు సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలను రాయనున్నారు. మొత్తం 15 పాఠశాలకు చెందిన విద్యార్థులు కొయ్యూరు గురుకుల పాఠశాల, ప్రభుత్వోన్నత పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాల–1లో కేంద్రాలను కేటాయించారు. ఒక్కో పాఠశాలకు ప్రత్యేకాధికారిని, ఇద్దరు సహాయకులను నియమించారు. వారు కాకుండా డిపార్టుమెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పకడ్బందీగా పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేశామని మండల విద్యాశాఖ అధికారి శెట్టి సుందర్‌రావు తెలిపారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలకు 569 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ప్రభుత్వ ఉన్నత, గిరిజన బాలికల ఆశ్రమ, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు కట్టుదిట్టంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

అవగాహన రాహిత్యంతో టీడీపీ నేతల వ్యాఖ్యలు



చింతపల్లి ఎంపీపీ అనూషాదేవి



ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ హలియారాణి

చింతపల్లి: వైఎస్సార్‌సీపీపై టీడీపీ నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఎంపీపీ కోరాబు అనూషాదేవి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి విమర్శించారు. ఆదివారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజల్లోకి వెళ్లే ధైర్యం చేయలేకపోతున్నారని విమర్శించారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి సీఎం జగన్ ఇవ్వని హామీలను నెరవేర్చి ప్రజల్లో దేవుడిగా నిలిచాడన్నారు. ప్రస్తుతం ఉనికి చాటుకోవడానికి వైఎస్సార్ సీపీ పాకులాడుతుందని టీడీపీ నాయకులు విమర్శించడం అవివేకమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులకు కూటమి 9 నెలల్లో చేసిన అప్పులకూ ఎంతో తేడా ఉందన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించగలిగామన్నారు. నేడు కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలకే దిక్కు లేదని ఎద్దేవా చేశారు. మన్యంలో ఏమి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మూడు సార్లు హ్యాట్రిక్ సాధించిన పార్టీ తమదేనన్నారు. ఉనికి కోసం పాకులాడాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ నేతలే ఇక్కడ ఉనికి కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. అవగాహనలేమితో తమ పార్టీని విమర్శిస్తే తగిన గుణపాఠం చెప్పవలసి వస్తుందని హెచ్చరించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న స్థానిక నాయకులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం స్థానిక ఆర్యవైశ్య నాయకులు, గ్రామపెద్దలు ఘన నివాళులర్పించారు. సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఆద్య రమేష్, ఊరా వీర్రాజు, సూర్యసుబ్రహ్మణ్యం, పాపారావు, కామేశ్వర్రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లలో కిరికిరి



లంక పొగాకు పంట

- గవ్వ తీసేసి కోత కోయాలంటున్న దళారులు
- తూకం పడిపోయి నష్టపోతామని రైతుల ఆందోళన
- గతేడాది మాదిరిగానే కొనుగోలు చేయాలని అభ్యర్థన
- నాలుగు మండలల్లో 4 వేల ఎకరాల్లో సాగు

వీఆర్‌పురం: లంక పొగాకు కొనుగోళ్లలో దళారులు మోసపూరిత విధానాలు అవలంబిస్తున్నారు. లంక పొగాకును విరివిగా పండించాలని, తామే కొనుగోలు చేస్తామని సమావేశాలు పెట్టి మరీ రైతులకు చెప్పారు. ఆపై ఒప్పందం చేసుకున్నారు. తీరా పంట పండించాక ధర నిర్ణయించకుండా సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. లంక పొగాకును విడిగా రెక్కండని చెబుతున్నారు. లేకపోతే కొనుగోలు చేయలేమంటున్నారు. దాంతో నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత సంవత్సరం వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో రైతుల నుంచి అధిక మొత్తంలో పొగాను కంపెనీ దళారులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా లంక పొగాకును విరివిగా పండించాలని, తామే కొనుగోలు చేస్తామని సమావేశాలు పెట్టి రైతులకు చెప్పారు. పొగాకును కిత్తనారతో కుట్టొద్దు, లింకు కోత కొయ్యాలన్నారు. నాలుగు మండలాల్లో గిరిజన, గిరిజనేతర రైతులకు చెప్పి పొగాకును కంపెనీకే ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శబరి పరివాహిక ప్రాంతాలైన నాలుగు మండలాల్లో 4 వేల ఎకరాల్లో లంక పొగాకు విస్తారంగా సాగు చేశారు. ఇప్పుడు వచ్చి లంక పొగాకును విడిగా రెక్కండని చెబుతున్నారు. లేకపోతే కొనుగోలు చేయలేమంటున్నారు. ముందుగా కంపెనీ చెప్పినట్లు లింకు కోత కోశామని, లంక పొగాకును రెక్కటం వల్ల తూకం పూర్తిగా తగ్గిపోతుందని, కూలీల ఖర్చు విపరీతంగా పెరిగి దిగుబడి తగ్గి గిట్టుబాటు ధర రాదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కానీ కంపెనీ వారు ఆకు రెక్కండి, మంచి రేటు ఇస్తామని కాలయాపన చేస్తున్నారు. దీనివల్ల రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.

ధర నిర్ధారించకుండా కాలయాపన...

రైతులకు కంపెనీ ముందుగా చెప్పినట్లుగా లింకు కోత కోసిన పొగాకును ఈ సంవత్సరానికి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కొంతైనా ఆకును రెక్కండని కంపెనీ చెప్పి ఇప్పుడు మొత్తం రెక్కండని చెబుతోంది. దీనివల్ల కంపెనీ ఏ రేటు కడుతుందోనని రైతులు దిగులు చెందుతున్నారు. మంచి రేటు ఇస్తామని కంపెనీ చెబుతున్నా, ఇంత వరకు రేటు నిర్ధారించలేదు. అందువల్ల రైతులు కంపెనీ వారి మీద అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ వారు ప్రోత్సహించినట్లుగా అధిక మొత్తంలో సన్న, చిన్న కారు రైతాంగం పొగాకు సాగు విరివిగా పండించారు. మీటింగ్ పెట్టి క్వింటా పొగాకు రూ.1,773 కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలలో కొనుగోలు చేసేవారు. ఇప్పుడు మార్చి 16వ తేదీ దాటిన కొనుగోలు చేయటం లేదు. పొగాకు నిల్వ ఉంచలేకపోతున్నారు. బయట నుంచి అప్పు తెచ్చి వ్యవసాయం చేస్తున్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష వరకు పెట్టుబడి ఖర్చవుతుంది. కంపెనీ ముందు చెప్పిన విధంగానే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం అలసత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

కె.కోటపాడు: గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో చెరకు సభ్య రైతులు నష్టాల బారిన పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. కింతాడ పంచాయతీ శివారు రామచంద్రపురంలో పార్టీ మండల మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో రైతులు పెద్ద సంఖ్యలో చెరకు పంట సాగు చేస్తున్నారన్నారు. ఈ పంటను గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో క్రషింగ్‌ను చేయలేని పక్షంలో రైతులు పండించిన పంటను ఏమి చేసుకోవాలో ప్రభుత్వమే చెప్పాలని ఆయన కోరారు. గత క్రషింగ్ బకాయిలను ఫ్యాక్టరీ యాజమాన్యం నేటికీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు, మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు, పొంతపల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, ప్రసాదం అందజేశారు.

ఆకట్టుకున్న ఎడ్లబళ్ల పోటీలు



కశింకోటలోని కస్పావీధిలో నిర్వహిస్తున్న ఎడ్ల బళ్ల పరుగు పోటీలు



ఉత్సాహంగా తిలకిస్తున్న ప్రజలు

కశింకోట: కశింకోటలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు ఆదివారం సాయంత్రం ఉత్సాహభరితంగా సాగాయి. స్థానిక కస్పావీధిలో వెలసిన పడమటమ్మ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలు నిర్వహించారు. పిల్లలతో పాటు పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను ఆద్యంతం ఆనందోత్సాహాలతో వీక్షించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 11 ఎడ్ల బళ్లు పోటీలో పాల్గొన్నాయి. ఎస్ఐ కె. లక్ష్మణరావు సిబ్బందితో పర్యవేక్షించారు.

దండి సురవరం ఎడ్ల బండికి ప్రథమ బహుమతి..

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలో దండి సురవరం గ్రామానికి చెందిన హర్ష వర్ధన్‌నాయుడు ఎడ్ల బండికి ప్రథమ స్థానం లభించింది. బి. కొత్తూరుకు చెందిన మురుకుర్తి శంకరరావు బండికి ద్వితీయ స్థానం, ఎం.కోటపాడుకు చెందిన పాసిలి నాగరాజు బండికి తృతీయ, చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ బండికి నాలుగు, మామిడిపల్లికి చెందిన లెక్కల సత్యనారాయణ బండికి పంచమ, నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన శివ తేజ బండికి ఆరవ స్థానం లభించాయి. ఉత్సవ నిర్వాహకులు వారికి నగదు బహుమతులు అందజేశారు.

వారాడలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కె.కోటపాడు : వారాడ గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. బొద్దాన దేముడుకు చెందిన పశువుల పాక, యూకలిప్టస్ చెట్లు కాలిపోయాయి. మధ్యాహ్నం సమయంలో పాకకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. సమాచారం తెలుసుకున్న రైతు దేముడు, ఆయన కుటుంబ సభ్యులు వచ్చి మంటలను ఆర్పేందుకు ఎంత యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కొత్తవలస నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. అగ్నిప్రమాదంలో పశువుల పాకతో పాటు సుమారు 15 సెంట్లలో ఉన్న యూకలిప్టస్ చెట్లు కాలిపోయాయి. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు దేముడు తెలిపారు.

రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం



వైద్య సేవలను పర్యవేక్షణ చేస్తున్న స్వామిజీ

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార **వైద్యశాల రాజ**మహేంద్రవరం ఆధ్వర్యంలో సిరి**గిందలపాడులో** ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం **నిర్వహించారు.** వైద్యులు జీవీ రామారావు, కస్తూరి **సుబ్రహ్మణ్యం,** శ్రీకృష్ణ పాతూరి, టీవీ సుబ్బారావు **తదితరులు వైద్య** సేవలు అందించారు. 118 మం**దికి రక్తపరీక్షలు** చేశారు. వైద్య శిబిరంలో 400 మందికి వైద్య సేవలందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. 32 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేసి, నలుగురిని కంటి ఆపరేషన్ల నిమిత్తం వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామీజీ రఘువీరానందజీ మహారాజ్, క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాసరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

అరకు ఎమ్మెల్యే రేగం పరామర్శ



రామారావు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

పెదబయలు: మండలంలో పెదకోడాపల్లి పంచాయతీ మొండికోట గ్రామానికి చెందిన నందిబోయిన రామారావును అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదివారం పరామర్శించారు. ఇటీవల మొండికోటలో అగ్నిప్రమాదంలో గాయపడిన రామారావు ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఏ సమస్యా ఉన్న తమను సంప్రదించాలన్నారు. అనంతరం హుకుంపేట మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇదే గ్రామానికి చెందిన ఎస్. నాగరాజు భార్యాపిల్లలను పరామర్శించారు. నలుగురు పిల్లలు ఉన్నారని, వారి కుటుంబాన్ని ఆదుకుంటామని ఓదార్చారు. అదేవిధంగా గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించి వినతులు స్వీకరించారు. పెదకోడాపల్లి పంచాయతీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండెకరాల కాఫీ తోట దగ్ధం

- 15 ఏళ్ల కష్టం బూడిదపాలు
- లబోదిబోమన్న గిరిజనుడు



లాసేరులో కాలిబూడిదైన కాఫీ తోట

డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ లాసేరు గ్రామంలో రెండెకరాల్లో కాఫీ తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమైంది. బాధిత గిరిజనుడు భువనేశ్వరరావు వివరాల మేరకు... అతనికి ఎటువంటి వారసత్వ భూములు లేకపోవడంతో కొండ పోడును నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. రెండెకరాల్లో తను సాగు చేస్తున్న కాఫీ తోటకు ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న బాధితుడు 15 ఏళ్ల కష్టం బూడిదైందని లబోదిబోమన్నాడు. ముగ్గురు పిల్లల చదువులు, వారి జీవనోపాధికి మిగిలిన తోట దగ్ధమవ్వడంతో రోడ్డున పడాల్సి వచ్చిందని కన్నీరు మున్నీరయ్యాడు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వం నుంచి తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

పాడేరు ఎమ్మెల్మేను విమర్శిస్తే ఉపేక్షించేదిలేదు

చింతపల్లి జెడ్పీటీసీ బాలయ్య,
అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి గణబాబు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య పడాల్, అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి గణబాబు

చింతపల్లి: పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును పార్టీ మండలాధ్యక్షుడు విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్, అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పాంగి గణబాబు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పార్టీ మండలాధ్యక్షుడి హోదాలో విమర్శించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి నాయకులతో చేతులు కలిపి విమర్శలు చేయడం తగదన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నందున అధిష్టానం సముచిత స్థానం కల్పించి పదేళ్ల పాటు మండలాధ్యక్షుడిగా అవకాశం కల్పించిందన్నారు. నేడు అధికారం లేకపోవడంతో చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. పార్టీ బలోపేతానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రక్షాళన చేస్తున్న నేపథ్యంలో అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి పని చేయాలన్నారు. అంతేగానీ ఇలా బహిరంగ విమర్శలకు పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు. ఏజెన్సీలో పార్టీ అభివృద్ధికి జిల్లా అధ్యక్షుడిగా విశ్వేశ్వరరాజు ఎంతో శ్రమిస్తున్నారని, అటువంటి నాయకున్ని విమర్శించడం తగదన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరినీ కలుపుకునే స్వభావమున్న నాయకుడిగా గుర్తింపు పొందారని, అటువంటి వ్యక్తిపై వ్యక్తిగతంగా విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘ఉపాధి’ బకాయి బిల్లులు చెల్లించాలి



వి.సంతపాలెంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : ఉపాధి వేతనదారులకు 11 వారాలకు సంబంధించిన బకాయి బిల్లులను అధికారులు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలో సూర్రెడ్డిపాలెం, వి.సంతపాలెం, వారాడ, ఆనందపురం, పోతనవలస, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎస్సీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సదుపాయం ఉన్నా వి.సంతపాలెం గ్రామంలో పలువురికి విద్యుత్ బిల్లులు పంపడం దారుణమన్నారు. సూర్రెడ్డిపాలెం చెరకు కాటా వద్దకు తీసుకువచ్చిన చెరకు 20 రోజులుగా అక్కడే ఉందన్నారు. చెరకు ఎండిపోవడం కారణంగా రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి

అనకాపల్లి టౌన్: సార్వత్రిక ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, అందుకు అనుగుణంగా రాష్ట్ర శాసన సభలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం బీసీ సంక్షేమ నూతన కార్యవర్గం ఎన్నిక, సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారంలో జనాభా నిష్పత్తి ప్రకారం అధికారాన్ని పంచాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ అధ్యక్షురాలిగా పెదపాటి కళ్యాణి, రాష్ట్ర యూత్ కమిటీ కార్యదర్శిగా చింతకాయల కొర్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిల్లల శంకర్రావు, జిల్లా యూత్ కార్యదర్శులుగా సిమ్మ శ్రీను, ఎలమంచిలి ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంధం వెంకట రమణ, రాష్ట్ర ఇన్‌చార్జి వై. నూకాలమ్మ, ఉపాధ్యక్షుడు బర్నికాన బాబూరావు, కార్యదర్శి కొణతాల అప్పలరాజు, యువజన విభాగం అధ్యక్షుడు లద్దిక మల్లేష్, కన్వీనర్ చల్లంగి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.